07-01-2021 ఉదయము : మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనము

" మధురమైన పిల్లలూ - ఈ భారతదేశము స్వర్గంగా ఉన్నప్పుడు మీరు సంపూర్ణ వెలుగులో ఉండేవారు, ఇప్పుడిది అంధకారము, మళ్ళీ వెలుగులోకి వెళ్ళండి. "

ప్రశ్న :- తండ్రి తన పిల్లలకు ఏ కథను వినిపించేందుకు వచ్చారు ?

జవాబు :- తండ్రి చెప్తున్నారు - మధురమైన పిల్లలారా, నేను మీకు 84 జన్మల కథను వినిపిస్తాను. మీరు మొట్టమొదటి జన్మలో ఉన్నప్పుడు ఒకే దైవీ ధర్మముండేది, రెండు యుగాల తర్వాత మీరే పెద్ద - పెద్ద మందిరాలను కట్టించారు. భక్తి ప్రారంభించారు. ఇప్పుడిది మీ అంతిమ సమయములోని అంతిమ జన్మ. మీరు ఓ దుఃఖహర్తా - సుఖకర్తా! రండి..... అని పిలిచారు. ఇప్పుడు నేను వచ్చాను.

పాట :- ఈనాడు మనిషి అంధకారములో ఉన్నాడు.... (ఆజ్ అంధేరే మే హై ఇన్‌సాన్....)

ఓంశాంతి. ఇపుడిది కలియుగ ప్రపంచమని, అందరూ అంధకారములో ఉన్నారని పిల్లలకు తెలుసు. భారతదేశము స్వర్గంగా ఉన్నప్పుడు వెలుగులో ఉండేవారు. ఇప్పుడు హిందువులుగా పిలువబడే భారతవాసులు మొదట దేవీదేవతలుగా ఉండేవారు. ఇతర ఏ ధర్మమూ లేన్నప్పుడు భారతదేశములో స్వర్గవాసులుండేవారు. ఒకే ధర్మముండేది. స్వర్గము, వైకుంఠము, బహిస్త్, హెవెన్ - ఇవన్నీ భారతదేశము పేర్లే. భారతదేశము పవిత్రంగా ప్రాచీన, ధనవంత దేశముగా ఉండేది. ఇప్పుడు కలియుగములో భారతదేశము నిరుపేదగా ఉంది. ఇప్పుడు అంధకారములో ఉన్నామని, స్వర్గములో ఉన్నప్పుడు వెలుగులో ఉండేవారమని మీకు తెలుసు. స్వర్గములో రాజరాజేశ్వరుడు, రాజరాజేశ్వరిగా శ్రీ లక్ష్మీ నారాయణులు ఉండేవారు. దానిని సుఖధామమని అంటారు. తండ్రి ద్వారానే మీరు స్వర్గ వారసత్వాన్ని తీసుకోవాలి. దానిని జీవన్ముక్తి అని కూడా అంటారు. ఇప్పుడు అందరూ జీవన బంధనములో ఉన్నారు. ముఖ్యంగా భారతదేశము, పూర్తి ప్రపంచము రావణుని చెరసాలలో, శోకవాటికలో ఉంది. రాముడు భారతదేశంలో, రావణుడు లంకలో ఉండేవారని, రావణుడు వచ్చి సీతను అపహరించాడని చెప్పుకుంటారు కానీ అవన్నీ కట్టు కథలు. గీతయే ముఖ్యమైనది. సర్వశాస్త్రమయి శిరోమణి శ్రీమతము అంటే భగవంతుని ద్వారా భారతదేశములో వినిపించబడిన మతము. మనుష్యులు ఎవ్వరికీ సద్గతిని కలిగించలేరు. సత్యయుగంలో జీవన్ముక్త దేవీ దేవతలుండేవారు, వారు ఈ ఆస్తిని కలియు గాంతములో పొందారు. ఇది భారతవాసులకు తెలియదు, ఏ శాస్త్రాలలోనూ లేదు. శాస్త్రాలలో భక్తిమార్గపు జ్ఞానముంది. సద్గతినిచ్చే జ్ఞానము మనుష్యమాత్రులలో లేనే లేదు. అందరూ భక్తిని నేర్పించేవారే. శాస్త్రాలు చదవండి, దాన-పుణ్యాలు చేయండని చెప్తూ

ఉంటారు. ఈ భక్తి ద్వాపర యుగము నుండి కొనసాగుతూ వస్తుంది. సత్య-త్రేతా యుగాలలో జ్ఞాన ప్రాలబ్ధముంటుంది. అక్కడ కూడా ఈ జ్ఞానము కొనసాగుతూ వచ్చిందని కాదు. భారతదేశానికి ఉన్న ఈ వారసత్వము సంగమ యుగంలో తండ్రి ద్వారా లభించింది, అదే ఇప్పుడు మళ్ళీ మీకు లభిస్తూ ఉంది భారతవాసులు నరకవాసులుగా బేహద్ దుఃఖీలుగా అయినప్పుడు **ఓ పతితపావనా, దుఃఖహర్తా, సుఖకర్తా!** అని పిలుస్తారు. ఎవరి దుఃఖము? సర్వుల దుఃఖము ఎందుకంటే ముఖ్యంగా భారతదేశంలో, పూర్తిప్రపంచంలో అందరిలో పంచ వికారాలున్నాయి. తండ్రి పతిత పావనులు. తండ్రి చెప్తున్నారు - నేను కల్ప-కల్పము, కల్పము యొక్క సంగమ సమయములో వస్తాను. సర్వుల సద్గతిదాతగా అవుతాను. అహల్యలు, వేశ్యలు, గురువులు అందరినీ నేనే ఉద్ధరించవలసి వస్తుంది, ఎందుకంటే ఇది పతిత ప్రపంచము. పావన ప్రపంచమని సత్యయుగమును అంటారు. భారతదేశంలో ఈ లక్ష్మీనారాయణుల రాజ్యముండేది. వీరు స్వర్గాధికారులుగా ఉండేవారని భారతవాసులకు తెలియదు. పతిత ఖండము అంటే అసత్య ఖండము, పావన ఖండము అనగా సత్య ఖండము.భారతదేశము



పావన ఖండముగా ఉండేది. ఈ భారతదేశము అవినాశి ఖండము, అది ఎప్పుడూ వినాశనమవ్వదు. ఈ లక్ష్మీనారాయణుల రాజ్యమున్నప్పుడు ఇతర ఏ ఖండమూ ఉండేది కాదు. అవన్నీ తర్వాత వస్తాయి. కల్పము ఆయువు లక్షల సంవత్సరాలని వ్రాసేశారు. తండ్రి చెప్తున్నారు - కల్పము యొక్క ఆయువు కేవలం 5 వేల సంవత్సరాలు. మనుష్యులు 84 లక్షల జన్మలు తీసుకుంటారని వారంటారు. మనుష్యుని కుక్కగా, పిల్లిగా, గాడిద మొదలైనవిగా చేసేశారు. కాని పిల్లి, కుక్కల, జన్మ భిన్నమైనది, 84 లక్షల జీవరాసులున్నాయి. మనుష్యుల వెరైటీ ఒక్కటే. వారే 84 జన్మలు తీసుకుంటారు. తండ్రి చెప్తున్నారు - భారతవాసులే డ్రామా ప్లాను అనుసారము తమ ధర్మాన్ని మర్చిపోయారు.

కలియుగాంతములో పూర్తి పతితులై ఉన్నారు. తండ్రి మళ్ళీ సంగమ యుగములో వచ్చి పావనంగా చేస్తారు. దానిని దుఃఖధామని అంటారు, మళ్ళీ భారతదేశము సుఖధామంగా అవుతుంది. తండ్రి చెప్తున్నారు - ఓ పిల్లలారా! మీరు భారతవాసులు స్వర్గవాసులుగా ఉండే వారు, మీరు మళ్ళీ 84 జన్మలు మెట్లు దిగుతూ వచ్చారు. సతో నుండి రజో, తమోలోకి తప్పకుండా రావాలి. దేవతలైన మీ వంటి సదా ఆనందమైనవారిగా, సదా ఆరోగ్యవంతులుగా, ఐశ్వర్యవంతులుగా ఎవ్వరూ అవ్వరు. భారతదేశము ఎంతో ధనవంతముగా ఉండేది, వజ్ర వైఢూర్యాలు రాళ్ల వలె లభించేవి. రెండు యుగాల తర్వాత భక్తిమార్గములో ఇంత పెద్ద - పెద్ద మందిరాలను తయారుచేస్తారు. అవి కూడా ఎంత పెద్దవిగా నిర్మిస్తారు! సోమనాథ మందిరము అత్యంత పెద్దదిగా ఉండేది. కేవలం ఒక్క మందిరము మాత్రమే ఉండదు కదా. ఇంకా ఇతర రాజుల మందిరాలు కూడా ఉండేవి. ఎంతో దోచుకొని తీసుకెళ్ళారు. తండ్రి పిల్లలైన మీకు స్మృతినిప్పిస్తున్నారు. మిమ్ములను ఎంత షాహుకార్లుగా తయారుచేసి ఉండినాను. మీరు సర్వ గుణసంపన్నంగా, 16 కళా సంపూర్ణులుగా ఉండేవారు. యథా మహారాజా - మహారాణి వారిని భగవాన్ - భగవతి అని కూడా అనవచ్చు. కాని తండ్రి అర్థం చేయించారు - భగవంతుడు ఒక్కరే. వారే మన తండ్రి. కేవలం ఈశ్వరుడు లేక ప్రభువు అనడం వలన వారు సర్వాత్మల తండ్రి అని గుర్తు రాదు. తండ్రి కూర్చొని కథను వినిపిస్తారు. ఇది మీ అనేక జన్మల అంతిమ జన్మ. ఇది ఒక్కరి విషయము కాదు. యుద్ధ మైదానము మొదలైనవేవీ లేవు. తమ రాజ్యముండేదని భారత వాసులు మర్చిపోయారు. సత్యయుగం ఆయువును చాలా పెద్దదిగా చేసినందున చాలా దూరంగా తీసుకెళ్లారు. తండ్రి వచ్చి అర్థం చేయిస్తున్నారు - మనుష్యులను భగవంతుడని అనలేరు. మనిషి ఎవ్వరికీ సద్గతిని కలిగించలేరు. సర్వుల సద్గతిదాత, పతితుల పావనకర్త ఒక్కరే అను నానుడి(సామెత) కూడా ఉంది. సత్య ఖండాన్ని స్థాపించే సత్యమైన తండ్రి ఒక్కరే. పూజలు కూడా చేస్తారు - కానీ భక్తిమార్గంలో మీరు ఎవరి పూజలు చేస్తూ వచ్చారో, వారిలో ఒక్కరి జీవితచరిత్ర కూడా తెలియదు. అందుకే తండ్రి తెలియజేస్తున్నారు - మీరు శివజయంతిని జరుపుకుంటారుకదా. తండ్రి నూతన ప్రపంచ రచయిత, వారు హెవెన్‌లీ గాడ్‌ఫాదర్(స్వర్గ స్థాపనచేయు తండ్రి) అనంతమైన సుఖమునిచ్చేవారు. సత్యయుగంలో చాలా సుఖముండేది. దానిని ఎవరు ఎలా స్థాపించారు? ఇది తండ్రి కూర్చొని తెలియజేస్తారు. నరకవాసులను స్వర్గవాసులుగా చేయడం లేక భ్రష్టాచారులను శ్రేష్ఠాచార దేవతలుగా చేయడం, ఈ కర్తవ్యము తండ్రిదే. తండ్రి చెప్తున్నారు - నేను పిల్లలైన మిమ్ములను పావనంగా చేస్తాను. మీరు స్వర్గాధిపతులుగా అవుతారు. మిమ్ములను పతితులుగా ఎవరు తయారుచేస్తారు? ఈ రావణుడు. దు:ఖము కూడా ఈశ్వరుడే ఇస్తారని మనుష్యులంటారు. తండ్రి చెప్తున్నారు - నేను సర్వులకు ఎంత

సుఖమునిస్తానంటే మళ్ళీ మీరు అర్ధకల్పము వరకు తండ్రిని స్మృతియే చేయరు. మళ్ళీ ఎప్పుడైతే రావణరాజ్యంగా అవుతుందో, అప్పుడు అందరినీ పూజ చేయడంమొదలుపెడ్తారు. ఇది మీ అనేక జన్మల అంతిమ జన్మ. మేమెన్ని జన్మలు తీసుకున్నాము? అని పిల్లలు అడుగుతారు. బాబా చెప్తున్నారు - మధురాతి మధురమైన భారతవాసీ ఆత్మలారా! ఇప్పుడు నేను మీకు బేహద్ వారసత్వమునిస్తాను. పిల్లలూ, మీరు 84 జన్మలుతీసుకున్నారు. ఇప్పుడు మీరు 21 జన్మలకు తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకునేందుకు వచ్చారు.



అందరూ కలిసి ఒకేసారి రాలేరు. సత్యయుగసూర్యవంశ పదవినిమళ్ళీ మీరేతీసుకుంటారు. అనగా సత్యమైన బాబా ద్వారా నరుని నుండి సత్య నారాయణునిగా అయ్యే జ్ఞానము వింటున్నారు. ఇది జ్ఞానము, అది భక్తి. శాస్త్రాలు మొదలైనవన్నీ భక్తి మార్గానికి చెందినవి, అవి జ్ఞానమార్గానివి కావు. ఇది ఆధ్యాత్మిక జ్ఞానము. సుప్రీమ్ ఆత్మ వచ్చి జ్ఞానమునిస్తారు. పిల్లలు ఆత్మాభిమానులుగా అవ్వాల్సి వస్తుంది స్వయాన్ని ఆత్మగా భావించి నన్ను ఒక్కరినే స్మృతి చేయండి. తండ్రి అర్థం చేయిస్తున్నారు - ఆత్మలోనే మంచి లేక చెడు సంస్కారాలుంటాయి, దాని అనుసారంగానే మనుష్యులకు మంచి లేక చెడు జన్మలు లభిస్తాయి. తండ్రి కూర్చొని అర్థం చేయిస్తున్నారు - పావనంగా ఉండిన ఇతనే అంతిమ జన్మలో పతితమైనాడు, తతత్వమ్. తండ్రినైన నేను ఈ పాత రావణ ప్రపంచములో, పతిత ప్రపంచములో రావలసి వస్తుంది. మళ్ళీ ఎవరు నెంబర్‌వన్‌గా అవుతారో వారి తనువులోనే వస్తాను. సూర్యవంశీయులే పూర్తి 84 జన్మలు తీసుకుంటారు. ఇతను బ్రహ్మా, వీరు బ్రహ్మావంశీ బ్రాహ్మణులు. తండ్రి ప్రతి రోజు అర్థం చేయిస్తూ ఉంటారు. రాతి బుద్ధిని పారసబుద్ధిగా చేయడం పిన్నమ్మ ఇల్లంత సులభము కాదు. ఓ ఆత్మలారా! ఇప్పుడు ఆత్మాభిమానులుగా అవ్వండి. ఓ ఆత్మలారా! ఒక్క తండ్రినే స్మృతి చేయండి, రాజ్యమును కూడా స్మృతి చేయండి. దేహ సంబంధాలను వదిలేయండి. అందరూ మరణించవలసిందే. ఇప్పుడు అందరిది వానప్రస్థ అవస్థే. ఒక్క సద్గురువు తప్ప ఇతరులెవ్వరూ సర్వుల సద్గతి దాతగా ఎవ్వరూ అవ్వలేరు. తండ్రి చెప్తున్నారు - ఓ భారతవాసులైన పిల్లలారా,

మొట్టమొదట నా నుండి విడిపోయింది మీరే. ఆత్మలు-పరమాత్మ చాలా కాలము వేరుగా ఉండినారు... అని పాడ్తారు. మొదట భారతవాసీ దేవీ దేవతా ధర్మస్థులైన మీరే వచ్చారు. ఇతర ధర్మాలవారికి కొద్దిగానే జన్మలుంటాయి. పూర్తి చక్రమంతా ఎలా తిరుగుతుందో తండ్రే కూర్చొని అర్థం చేయిస్తున్నారు. ఎవరు ధారణ చేయరో, వారికి కూడా ఇది చాలా సులభము. ఆత్మలే ధారణ చేస్తాయి. పుణ్యాత్మలుగా, పాపాత్మలుగా అవుతాయి కదా. ఇది మీ 84వ అంతిమ జన్మ. మీరందరూ వానప్రస్థ అవస్థలో ఉన్నారు. వానప్రస్థములో ఉండేవారు - మంత్రము తీసుకునేందుకు గురువులను ఆశ్రయిస్తారు. మీకిప్పుడు దేహధారి గురువులను ఆశ్రయించే అవసరములేదు. మీకందరికి నేను తండ్రి, టీచరు, గురువును. నన్ను ఓ పతిత పావనా, శివబాబా అని పిలుస్తారు. ఇప్పుడు స్మృతి వచ్చింది. సర్వాత్మలకు వారు తండ్రి, ఆత్మ సత్యమైనది, చైతన్యమైనది. ఎందుకంటే ఆత్మ అమరమైన ది. సర్వాత్మలలో పాత్ర నిండి ఉంది. తండ్రి కూడా సత్యమైనవారు, చైతన్యమైనవారు. వారు మనుష్య సృష్టికి బీజరూపమైనందున - నాకు పూర్తి వృక్షము యొక్క ఆదిమధ్యాంతాలు తెలుసు అని చెప్తున్నారు. అందుకే నన్ను జ్ఞానసాగరులని అంటారు. మీలో కూడా పూర్తి జ్ఞానముంది. బీజము నుండి వృక్షము ఎలా వెలువడుతుంది? వృక్షము పెరిగేందుకు సమయము పడ్తుంది కదా. తండ్రి చెప్తున్నారు - నేను బీజ రూపమును, అంత్యములో పూర్తి వృక్షము శిథిలావస్థకు చేరుకుంటుంది. ఇప్పుడు చూడండి - పునాది అయిన దేవీ దేవతా ధర్మమే లేదు, అదృశ్యమైపోయింది. దేవతా ధర్మము అదృశ్యమైనప్పుడు తండ్రి రావలసి వస్తుంది - ఒకే ధర్మమును స్థాపన చేసి మిగిలిన వాటన్నింటినీ వినాశనము చేయిస్తారు. ప్రజాపిత బ్రహ్మ ద్వారా తండ్రి ఆదిసనాతన దేవీదేవతా ధర్మాన్ని స్థాపన చేయిస్తున్నారు. ఇదంతా తయారైన డ్రామా. ఇది అంత్యము కాదు. తండ్రి అంతిమ సమయములో, సృష్టి ఆదిమధ్యాంతముల జ్ఞానమును వినిపించవలసినప్పుడు తండ్రి వస్తారు. కనుక సంగమ యుగములోనే వస్తారు. మీకు తండ్రి ఒక్కరే. ఆత్మలందరూ మూలవతనములో నివసించే సోదరులు, ఆ ఒక్క తండ్రిని అందరూ స్మృతి చేస్తారు. దుఃఖములో అందరూ స్మరిస్తారు..... రావణ రాజ్యములో దుఃఖముంది కదా. సర్వుల సద్గతిదాత అయిన తండ్రిని అందరూ స్మరిస్తారు. వారిదే ఈ మహిమ. తండ్రి రాకుంటే భారతదేశాన్ని స్వర్గంగా ఎవరు తయారుచేస్తారు. ముస్లింలు మొదలైనవారంతా ఈ సమయంలో తమోప్రధానంగా ఉన్నారు. అందరూ తప్పకుండా పునర్జన్మలు తీసుకోవలసిందే. ఇప్పుడు నరకంలో పునర్జన్మ లభిస్తుంది. అందరూ స్వర్గానికి వెళ్లిపోతారని కాదు. హిందువులు ఎవరైనా చనిపోతే స్వర్గస్థులైనారని చెప్తారు. అంటే ఇంతవరకు నరకములో ఉన్నారనే కదా. ఇప్పుడు స్వర్గానికి వెళ్ళారు అందుకు మీ నోటిలో గులాబ్‌జామున్. వారు స్వర్గస్థులైనప్పుడు నరకపు ఆసురీ పదార్థాలను వారికెందుకు తిని

పిస్తారు. బెంగాలులో చేపలు మొదలైనవి కూడా తినిపిస్తారు. అరే! స్వర్గములో ఉన్నవారికి ఇవన్నీ తినే అవసరమేముంది. ఫలానావారు నిర్వాణధామానికి పోయారని అంటారు. అవన్నీ అసత్యాలే అని తండ్రి చెప్తున్నారు. వాపసు ఎవ్వరూ వెళ్ళలేరు. మొదటి నెంబరువారే 84 జన్మలు తీసుకోవలసి ఉంటే, వారెలా వెళ్ళగలరు?

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియ స్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:

1. ఆత్మలోని చెడు సంస్కారాలను తొలగించుకునేందుకు, ఆత్మాభిమానిగా ఉండే అభ్యాసము చేయాలి. ఇది అంతిమ 84వ జన్మ, వానప్రస్థ స్థితి అయినందున పుణ్యాత్మగా అయ్యే శ్రమ చేయాలి.
2. దేహ సంబంధాలన్నీ వదిలి ఒక్క తండ్రిని, రాజ్యాన్ని మాత్రమే స్మృతి చేయాలి, బీజము మరియు వృక్షముల జ్ఞానాన్ని స్మరిస్తూ సదా హర్షితంగా ఉండాలి.

వరదానము :- " విశ్వ పరివర్తన చేసే శ్రేష్ఠమైన కార్యము యొక్క బాధ్యతను నిభాయిస్తూ డబల్ లైట్‌గా ఉండే ఆధారమూర్త్ భవ."

ఎవరైతే ఆధారమూర్తులుగా ఉంటారో వారి పైననే మొత్తం బాధ్యతంతా ఉంటుంది. ఇప్పుడు మీరు ఏ రూపంతో, ఎక్కడ అడుగు వేసినా అలా అనేక ఆత్మలు మిమ్ములను అనుసరిస్తారు. ఇది బాధ్యత. కానీ ఈ బాధ్యత - అవస్థను తయారు చేసుకోవడంలో చాలా సహాయం చేస్తుంది. ఎందుకంటే దీని ద్వారా అనేక ఆత్మల ఆశీర్వాదాలు లభిస్తాయి. అందువలన బాధ్యత తేలికైపోతుంది. ఈ బాధ్యత అలసటను దూరం చేసేది.

స్లోగన్ :- "మనసు మరియు బుద్ధి రెండిటి బ్యాలన్స్ ఉంచి సేవచేస్తే సఫలత లభిస్తుంది. "

-: ఓంశాంతి :-

## జనవరి నెలలో విశేష తపస్య కోసం పాయింట్లు

## బ్రహ్మ బాబా యొక్క 18 అడుగులు

## 7 సంకల్పాల లోను మరియు స్వప్నంలో కూడా బంధనముక్తులు:

ఎలాగైతే బ్రహ్మా బాబా పాత ప్రపంచంలో ఉంటూ ఎటువంటి వ్యక్తి లేక వైభవాలతో, సంకల్పాల లోను మరియు స్వప్నంలో కూడా బంధనముక్తులుగా ఉండేవారో, ఎల్లప్పుడూ త్రిమూర్తి సింహాసనాధికారి , త్రికాలదర్శి స్మృతి స్వరూపంలో ప్రతి కర్మను త్రికలాల లోను తెలిసిన వారిగా ఉన్నారో, ప్రతి కర్మ శ్రేష్ఠ కర్మగా మరియు సుకర్మగా చేసుకున్నారు. పాత సంస్కారాల మరియు స్వభావాల నుండి అతీతంగా ఉన్నారు. సదా సాక్షితనం యొక్క సీట్ పై స్వయాన్ని సెట్ చేసుకున్నారు. అలా ఫాలో ఫాదర్ గా అవ్వండి. సత్యమైన రాజ ఋషి గా అవ్వండి.